మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

వో దేఖేతో ఉన్‌కీ ఇనాయత్
న దేఖేతో రోనా క్యా?
జో దిల్ గైర్‌క హో, ఉస్‌కా
ఖోనా క్యా ఔర్ పానా క్యా?

సృజనాత్మక కవులు, రచయితలు ఇంద్రజాలికుల కన్నా ఏమీ తక్కువ కారు. అక్షరాలతో, పదాలు ఏర్పాటు చేసి, ఆ పదాలతో ఎన్నెన్ని విభిన్నమైన అర్థాలు, భావాలు కలిగేట్టు చేస్తారంటే, నిజంగా వారిని మించిన మాయగాళ్లు మరొకరు లేరనిపిస్తుంది. సినిమా ప్రధానంగా దృశ్య మాధ్యమం. దృశ్యాల ద్వారా ప్రేక్షకుల మనస్సులలో భావాలు, ఊహలు, ఆలోచనలు కలిగిస్తుంది సినిమా. దృశ్యాలకు సంగీతం తోడయితే కనబడే దృశ్యం కలిగించే అనుభూతి తీవ్రత పెరుగుతుంది. సినిమాలో పాటలు కనబడే దృశ్య ప్రభావాన్ని ఇనుమడింప చేయటమే కాదు సినిమాను, నటీనటులను ప్రేక్షకుల మనస్సులలో చిరంజీవులుగా నిలుపుతాయి. ఎలాగయితే సినిమాలో ఒక దృశ్యం పండాలంటే స్క్రిప్టు సరిగ్గా ఉండాలి, నటన సరిగ్గా ఉండాలి, నేపథ్యంలో కనిపించే దృశ్యాలు, వినిపించే సంగీతం వంటివన్నీ సరిగ్గా అమరాలో, ఒకపాట సరిగ్గా పండాలంటే కూడా అలాగే, బాణీ కుదరాలి. బాణీలో పదాలు ఒదగాలి. పదాలు సరైన భావం పలకాలి, గాయనీ గాయకులు పాటను అర్థం చేసుకుని అనుభవిస్తూ భావాలకు జీవం పోయాలి, ఆపై తెరపై కనబడే దృశ్యం పాట ప్రభావాన్ని పెంచేట్టుండాలి. లేకపోతే, బయట వింటున్నంత సేపూ 'అద్భుతం' అనిపించిన పాట, సినిమాలో తేలిపోతుంది. ఇక్కడే సినీగేయ రచయితల ప్రతిభ ప్రస్ఫుటమౌతుంది. సినిమాలో హాస్య సందర్భం సినిమాలో చూస్తున్నంత సేపూ హాస్యం పండుతుంది. అదే పాట దృశ్యం లేకుండా, దృశ్యాన్ని గుర్తు తెచ్చుకోకుండా వింటే జీవిత సత్యాలను అలతి పదాలతో అతి సులువుగా చెప్పే గొప్ప ప్రబోధాత్మక గీతం అనిపిస్తుంది. అంటే సందర్భ పరిధిలో ఒదుగుతూ మామూలుగా హాస్యగీతంలా అనిపించే పాటలో కూడా గొప్ప జీవిత సత్యాలు పొందు పరచి సమాజానికి ఆరోగ్యకరమైన హాస్యం ఇస్తూ

కూడా ఆలోచనలు కలిగిస్తూ మార్గదర్శనం చేసే బాధ్యతను సినీ గేయరచయితలు అత్యద్భుతంగా నిర్వహించారన్నమాట. ఇందుకు చక్కని ఉదాహరణ 'ఫంటూష్' సినిమాలో సాహిర్ లూధియాన్వీ రాయగా ఎస్డీ బర్మన్ సంగీత దర్శకత్వంలో కిషోర్ కుమార్, ఆశాభోంస్లేలు అత్యద్భుతంగా పాడిన పాట 'వో దేఖేతో ఉన్‌కీ ఇనాయత్ '

'ఫంటూష్' అన్న పదం ఒక విశేషణం. పక్షిలాగా స్వేచ్ఛగా జీవించేవాడు . మరుక్షణం ఏమవుతుందో రేపెలాగ? అన్న ఆలోచనలు లేకుండా జీవితాన్ని ఏ క్షణానికి ఆ క్షణంగా అత్యంత ఆనందంగా, ఎలాంటి చీకూ చింతా లేకుండా గడిపేవాడిని 'ఫాంటూష్' అంటారు. 1956లో విడుదలయిన ఈ సినిమాలో దేవ్‌ఆనంద్ హీరో. దర్శకత్వం వహించింది దేవ్ ఆనంద్ పెద్దన్నయ్య చేతన్ ఆనంద్. ఇది దేవానంద్ స్వంత నిర్మాణ సంస్థ నవకేతన్ నిర్మించిన చిత్రం.

దేవ్ ఆనంద్ తనదంటూ ప్రత్యేక స్టైల్‌ను ఏర్పాటు చేసుకునేందుకు సోదరులతో కలిసి నవకేతన్ నిర్మాణసంస్థను స్థాపించాడు. చేతన్ ఆనంద్ దర్శకుడు. దేవ్ ఆనంద్ హీరో. విజయ్ ఆనంద్ స్క్రిప్టు రచయిత.. తరువాత దర్శకుడిగా ఎదిగాడు. నవకేతన్ సంస్థ ద్వారా తన ఇమేజిని స్థిర పరచుకునేందుకు దేవ్ ఆనంద్ ప్రయత్నించాడు. చేతన్ ఆనంద్ సీరియస్ సినిమా దర్శకుడు. ఆయన ప్రయోగాలు చేస్తూ, అర్ధవంతమైన సినిమా రూపొందించాలని తపన పడతాడు. మెలో డ్రామాకు ప్రాధాన్యం ఇవ్వడు. కానీ దేవ్ ఆనంద్ ఇమేజీవేరు. దాంతో వీరిద్దరి నడుమ అభిప్రాయ భేదాలు వచ్చి చేతన్ ఆనంద్. నవకేతన్‌ని వదిలి పెట్టాడు. ఆ తరువాత ఆ స్థానాన్ని విజయ్ ఆనంద్ (గోల్డీ ఆనంద్) భర్తీ చేశాడు. నవకేతన్ సంస్థకు చేతన్ ఆనంద్ దర్శకత్వం వహించిన చివరి సినిమా 'ఫంటూష్ '

'ఫంటూష్' కథ గమ్మత్తయినది. మన కమర్షియల్ సినిమాలలో ఇలాంటి సినిమాను ఊహించటం కష్టం. ఒక హీరో ఇలాంటి పాత్రను పోషించటం కూడా కష్టం. తన కెరీరులో దేవ్ ఆనంద్ తన నటన స్టైలును ప్రదర్శిస్తూనే అనేక విభిన్నమైన పాత్రలు పోషించాడు. వాటిల్లో 'ఫంటూష్ ' ఒకటి.

హీరో సినిమా ఆరంభంలోనే పిచ్చాస్పత్రినుంచి విడుదలవుతాడు. అనేక మోసాలకు గురవుతాడు. చివరికి ఆత్మహత్య చేసుకోబోతూంటే, ఓ ధనవంతుడు అతని జీవిత భీమా చేసి నెల తరువాత ఆత్మహత్య చేసుకోమంటాడు. అక్కడి నుంచి అసలు సినిమా ఆరంభమవుతుంది. హీరో పిచ్చివాడు కాబట్టి హాస్యానికి బోలెడంత అవకాశం ఉంటుంది. సినిమా ఆరంభంలోనే తన టోపీ గురించి 'ఏయ్ మేరె టోపీ పలట్ కె ఆ' అంటూ ఓ పాట ఉంటుంది.

'దేనేవాలె జబ్ భి దేతా' అని హాస్యగీతం ఉంటుంది. నవకేతన్ సినిమాల్లో సంగీత దర్శకుడు ఎస్డీ బర్మన్. ఎస్డీ బర్మన్‌తో గొడవపడి ఆయనకు పాటలు రాయకూడదని నిశ్చయించుకునే వరకూ నవకేతన్ సినిమాల్లో పాటలు రాసింది సాహిర్ లూధియాన్వీ. నవకేతన్‌లో ఎస్డీ బర్మన్, సాహిర్‌లు కలసి పనిచేసిన చివరి సినిమా ఫంటూష్. దీని తరువాత హం దోనో సినిమాకు సాహిర్ పాటలు రాశాడు. ఆ సినిమా సంగీత దర్శకుడు జయదేవ్.

ప్రధానంగా 'ఫంటూష్' హాస్య సినిమా అయినా అంతర్లీనంగా సమాజంలోఉన్న స్వార్థాన్ని, మోసాన్ని, కుట్రలను ప్రదర్శిస్తుంది. ఈ సినిమాలో నాయికా నాయకుల నడుమ ప్రేమ చిగురిస్తుంది. కానీ ఆమె తండ్రి మరో వ్యక్తినిచ్చి వివాహం చేయాలనుకుంటాడు. అతను కవి. ముగ్గురూ బోటులో షికారుకు వెళ్తారు. అక్కడ కవి నాయికపై కవిత చెపితే, అతడిని హేళన చేస్తూ నాయికా నాయికలు ఈ పాట పాడతారు.

ఆంఖ్ ఝుకాకర్ బైఠ్ నె వాలి, ఆంఖ్ ఉఠాకే దేఖ్ జరా
హం భీ తొ తేరే చాహనే వాలే, తీర్ చలాకే దేఖ్ జరా

ఇదీ నాయక గురించి ఆమెని పెళ్లి చేసుకోవాలనుకునే కవి చెప్పిన కవిత. కళ్లు వాల్చి కూర్చున్నదానా, కళ్లెత్తి ఇటు చూడు. నిన్ను ప్రేమిస్తున్నవాడను నేను, కనుల బాణాలు విసిరి చూడు అంటున్నాడు. చక్కని కవిత. ఎలాంటి హాస్యం లేదు. పైగా నిజాయితీ ఉంది. ఆమె కళ్లెత్తి అతని వైపు చూస్తే గుండెలోకి సూటిగా బాణాలు దూసుకుపోతాయన్నమాట. ఈ చక్కని కవితను అపహాస్యం చేస్తూ కిషోర్ కుమార్ ప్రతిగా ఓ తవికలాంటి కవిత చెప్తాడు.

బందర్ జైసి సూరత్ తేరీ, ముర్గే జైసీ టాంగే హై
అరే వో క్యా దేఖే , తూభీ, ఖుద్‌కో ఆయినా లాకర్ దేఖ్ జరా

కోతిలాంటి ముఖం. కోడిలాంటి కాళ్లు నీవి. ఆమె నిన్ను ఏం చూస్తుంది, నిన్ను నువ్వే అద్దంలో సరిగ్గా చూసుకో.. అంటూ కిషోర్ కుమార్ తన మధురమైన స్వరంలో ఆలాపన చేసి పాట అందుకుంటాడు.

గాయకుడు అవ్వాలని సినీరంగంలో ప్రవేశించాడు కిషోర్ కుమార్. కానీ నటుడయితే డబ్బులు ఎక్కువ లభిస్తాయని అయిష్టంగా నటించాడు. అతని అయిష్టమైన ఈ నటన గొప్ప హాస్యంగా పరిగణనకు గురయింది. దాంతో బిజీ నటుడయ్యాడు. కానీ పాట పాడాలన్న కోరికను వదులుకోలేకపోయాడు. తన పాటలు తాను పాడుకున్నాడు.తన ప్రాణ స్నేహితుడయిన దేవ్ ఆనంద్ పాటలు పాడాడు. దేవ్ ఆనంద్ పాటలు మరీ ప్రత్యేకంగా పాడాడు కిషోర్ కుమార్. దేవ్ ఆనంద్ మాట్లాడే విధానాన్ని అనుకరిస్తూ దేవ్ ఆనంద్ మాటల్లో ఉండే ధ్వనిని అనుకరిస్తూ, కాస్త అల్లరిగా పాడతాడు. దాంతో దేవ్ ఆనంద్‌కు సరిగ్గా సరిపోతుంది. దేవ్ ఆనంద్ స్వయంగా పాట పాడాడన్న భ్రమను కలిగిస్తాడు కిషోర్ కుమార్. అలా దేవ్ స్వయంగా పాడేడన్న భ్రమను కలిగించే కిషోర్ కుమార్ పాటల్లో ఇదొకటి.

సాహిర్ లూధీయాన్వీ రాజీపడని గేయ రచయిత. ఆయనకు సినిమా స్క్రిప్టు నచ్చాలి. సినిమా పూర్తిగా వ్యాపారపరమైన సినిమా కాకూడదు. సినిమాలో ఏదో ఓ సందేశం ఉండాలి. సామాజిక స్పృహ ఉండాలి. హీరో హీరోయిన్లు నచ్చాలి. నిర్మాతలు, దర్శకులు నచ్చాలి. ముఖ్యంగా సంగీత దర్శకుడు నచ్చాలి. సాహిర్‌కు దేవ్ మంచి స్నేహితుడు. ఎస్డీ బర్మన్‌తో చక్కటి దోస్తీ. చేతన్ ఆనంద్ అంటే గౌరవం. నవకేతన్ సాహిర్ కు ప్రియమైన బ్యానర్. దాంతో పాటలు విజృంభించి రాశాడు. అయితే, కొన్నేళ్ల తరువాత ఎస్డీ బర్మన్‌తో విభేదించటంతో సాహిర్ నవకేతన్‌కు దూరమయ్యాడు. అది వేరే కథ.

సాహిర్ గొప్పతనం మామూలు ప్రేమ పాటల్లో కూడా, చిలిపి సందర్భాలలో కూడా తన సిద్ధాంతాలను, వ్యక్తిత్వాన్ని, జీవిత సత్యాలను పొందుపరిచి మెప్పించటం. పాట ఆరంభంలో వచ్చే కవితలు గమ్మత్తయినవి. నాయకకు ఇష్టంలేని వ్యక్తి చక్కటి భావాత్మకమైన ప్రేమ కవిత చెప్పాడు. దానికి ప్రతిగా వెక్కిరిస్తూన్న కవితను రాసింది సాహిర్. కానీ పాట దగ్గరకు వచ్చేసరికి సాహిర్ కవిత వెక్కిరింత పొలిమేరల్లో విహరిస్తూ జీవిత సత్యాన్ని బోధిస్తుంది.

వో దేఖేతో ఉన్‌కీ ఇకాయత్, న దేఖేతో రోనా క్యా?

'కళ్లు తిప్పుకున్న అమ్మాయీ నా వైపు కళ్లెత్తి చూడు' అన్న కవితను, కవి ఓ అమ్మాయిని తనవైపు చూడమని బ్రతిమిలాడుతున్నాడని భావిస్తూ హీరో వెక్కిరిస్తున్నాడు. హీరోకి తెలుసు నాయిక తనని ఇష్టపడుతోందని. అందుకని కిషోర్‌కుమార్ స్వరంలో కాస్త వెక్కిరింత, కాస్త బుజ్జగింపు జోడించి వ్యంగ్యంగా ప్రభోదిస్తున్నటు పాడతాడు. దేవ్ ఆనంద్ కూడా వంకర చూపులతో, వింతనవ్వుతో, చులకనగా చూస్తూ, తెలివిలేని పిల్లవాడికి బోధిస్తున్నట్టు నటిస్తాడు. గొప్ప సత్యం చక్కగా చెప్తాడు.

ఆమె నీ వైపు చూడటం ఆమె కృప. ఆమె నీ వైపు చూడకపోతే ఏడవటం అనవసరం.

ప్రేమలో ప్రియుడు ప్రేయసి తనవైపు చూడాలని తపిస్తాడు. ఆమె కళ్లు తనమీద పడితే పులకరించి పరవశిస్తాడు. ఆమె కడగంటి చూపులే తన ప్రాణం నిలిపేవని భావిస్తాడు. ఆమె తనవైపు చూడకపోతే తనజీవితం వ్యర్థం అని భావిస్తాడు.

'తెరి ఎక్ నిగాహకి బాత్ హై మెరి జిందగీ క సవాల్ హై '
'నీకు ఒక చూపు మాత్రమే. అది నాకు జీవన్మరణ సమస్య ' అంటాడో తీవ్ర ప్రేమికుడు.
యే ఉఠే సుబహ సుబహ చలే, యే ఝుకే, షాం ఢలే
మెరె జీనా, మెర మర్‌నా ఇన్‌హి పల్కోంకె తలే

ఆమె కళ్లెత్తితే ఉదయం, కళ్లు దించితే సాయంత్రం . మరణించటం, బ్రతకటం ఈ కనురెప్పల నీడలలోనే అంటాడింకో తీవ్రాతి తీవ్ర ప్రేమికుడు.

తుం నె ముఝే దేఖా హోకర్ మెహెర్బాన్
రుక్ గయీ యే జమీన్, థం గయా ఆస్మాన్

నువ్వు ప్రేమతో, దయతో నావైపు చూశావు. భూభ్రమణం ఆగిపోయింది. ఆకాశం స్థంభించిపోయింది అంటాడింకో తీవ్రాతి తీవ్రమైన ప్రేమికుడు. ఇలా చెపుతూ పోతే హిందీ సినీగీతాలలో నాయిక తనవైపు చూడటం, ఆమె దృష్టి తన వైపు ప్రసరించటంతో నాయకుడు తన జన్మధన్యమైనట్టు భావించుకోవటం ఆనవాయితీ. కాబట్టి నాయికను కళ్లెత్తి తనవైపు చూడమని కవి బ్రతిమిలాడటంలో ఎలాంటి అనౌచిత్యం, అపహాస్యం లేదు. కానీ దాన్ని అనౌచిత్యం అనిపించేట్టు చేస్తూ అపహాస్యం చేస్తున్నాడు సాహిర్ తన పాట ఆరంభంలోనే.

ఒక యువతి, యువకుడి వైపు ప్రేమ దృక్కులు ప్రసరింపచేయటం ఆమె దయ. ఆమె కరుణ. అతడిపై ఆమె కృప. అంతే తప్ప, అది హీరో అందగాడవటమో, అతడి గొప్ప తనమోకాదు. ఎంతో ఇష్టపడితే తప్ప ప్రేమతో బరువవుతున్న కళ్లను ఎత్తి యువతి, పెదవులపై చిందే చిరునవ్వును అణచుకుంటూ యువకుడివైపు చూడదు. ఆ చూపు బాణమై యువకుడి హృదయాన్ని చీల్చి వేస్తుంది. ప్రేమ గాయం చేస్తుంది. అందుకే కనుబొమలను 'విల్లు'తో పోలుస్తారు. కళ్లు బాణాలు వేస్తాయంటారు.

కహీన్ టూట్ జాయేనా హస్రత్ భరా దిల్
న యూన్ తీర్ ఫేంకో నిషానా బదల్ కర్

'కోరిక నిండిన హృదయం పగిలి పోగలదు. నువ్వు విసిరే బాణంతో' అంటాడు దిలీప్ కుమార్, 'ఉడాన్ ఖటోలా ' సినిమాలో రఫీ గొంతుతో.

తన్ తన్ కర్ జాలిం నే అప్నా
హర్ తీర్ నిషానే పే మారా

హై షుకర్ కి బ్ తక్ జిందా హూన్
మై దిల్ కా ఘాయల్, బేచారా...

శైలేంద్ర రాయగా రఫీ పాడగా, షమ్మీకపూర్ అద్భుతంగా నటించిన ఈ పాటలో కూడా ఆమె ప్రతి బాణం పూర్తిగా లక్ష్యాన్ని ఛేదించేట్టు వేసిందనీ, దానివల్ల అతడి గుండెకి గాయమైందని, అయినా భగవంతుడి దయవల్ల బ్రతికే ఉన్నాననీ, ఎంతో కవితాత్మకంగా హాస్యాన్ని పండిస్తున్నాడు 'జంగ్లీ '.

కాబట్టి, కవి, యువతిని తన వైపు కళ్లెత్తి చూడమని అభ్యర్థించటంలో ఎలాంటి అనౌచిత్యం, హాస్యం లేదు. కానీ సాహిర్ 'ఈ కళ్లెత్తి చూడటాన్ని ఎక్కడ అపహాస్యం చేశాడంటే, 'ఆమె కళ్లెత్తి చూడటం ఆమె ఇష్టం. నువ్వెంత బ్రతిమిలాడినా లాభంలేదు ' అంటున్నాడు.

'జో ఇన్‌కి నజర్ సె ఖేలే, దుఖ్ పాయే ముసీబత్ ఝేలే '

అంటాడు సాహిర్, 'మునీంజీ' సినిమాలో , 'జీవన్ కె సఫర్ మే రాహీ ' పాటలో. 'ఎవరెవరయితే వారి చూపులతో ఆడతారో, వారు దుఃఖం పొందుతారు. కష్టాలు తలెత్తుకుంటారు' అని స్పష్టం చేస్తున్నాడు. 'నజర్ సే ఖేల్ నా' అంటే కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం, దాగుడు మూతలాడటం కాదు. 'నజర్ సే ఖేల్ నా ' అంటే కళ్ల ద్వారా హృదయంలో ప్రవేశించటం. హృదయంలో స్థానం ఇవ్వటం. కళ్లతో సంభాషించటం సందేశాలు పంపటం. ఇష్టాయిష్టాలు తెలియచేయటం. ఇలా 'నజర్ సే ఖేల్ నా' అంటే వారి కళ్లతో కళ్ళు కలిపి హ్రుదయాన్ని ఇచ్చి పుచ్చుకోవటం. ఎందుకంటే ప్రేమలో 'దృష్టి' ప్రధాన పాత్ర పోషిస్తుంది.

కాబట్టి ఓ యువతి పురుషుడి వైపు చూడటం, చూడకపోవటం ఆమె ఇష్టం. ఆమె కృప. ఎంత బ్రతిమిలాడినా లాభంలేదు. అయితే, దెబ్బ ఎక్కడ కొడుతున్నాడంటే, ఆమె హృదయం అప్పటికే పరాయివాడిదయిపోయింది. యువకుడిది కాదు ఆమె హృదయం. తనది కానిది పరాయిది. కాబట్టి పరాయిదయిన హృదయాన్ని పొందటం ఏముంది? కోల్పోవటం ఏముంది? కాబట్టి ఆమె యువకుడి వైపు చూడటం ఆమె కృప. బ్రతిమిలాడి లాభం లేదు. ఇష్టమైతే చూస్తుంది లేకపోతే లేదు. దాని గురించి ఏడవటం, బాధపడటం అనవసరం.

యువతకు గొప్ప సందేశం ఇచ్చాడు సాహిర్, తేలికగా అనిపించే ఈ పల్లవితో. యువకుడు యువతి కోసం ఆశపడటం సహజం. అది ప్రాకృతికం. కానీ ఆమె తన ఇష్టాన్ని వ్యక్త పరచేవరకూ ఆమె పరాయిదే. కాబట్టి తనది కానిది ఉంటే ఎంత? పోతే ఎంత? దానికోసం బాధపడి ఏడ్చి జీవితాన్ని నాశనం చేసుకోవటం వ్యర్థం. అమ్మాయి కనబడితే

యువకుడి హృదయం స్పదించటం స్వాభావికం. ప్రాకృతికం. అమ్మాయి అతడి స్పందనకు ప్రతి స్పందననివ్వటం ఆమె ఇష్టం. ఇస్తే సరి. లేకపోతే ఏడవటం అనవసరం. ఆమె హృదయం ఎలాగో నీదికాదు. నీది కానిది, నీ దగ్గర లేనిది పోతే బాధపడతం మూర్ఖత్వం. అర్ధవిహీనం. ఇది సాహిర్ తత్త్వం.

తుం న అగర్, బోలోగే సనం
మర్తొ నహీ జాయేంగె హం
క్యా పరీ యా హూర్ హో? , ఇత్నె క్యూన్ మగ్ రూర్ హో??..

సాహిర్ రాసిన ఈ పాట మజ్రూహ్ పేరుతో చలామణిలోకి వచ్చింది. నువ్వు నాతో మాట్లాడకపోతే నేనేం చావను. నిన్ను నువ్వు పెద్ద దేవదూతవో, అందగత్తెవో అనుకుంటున్నట్టున్నావు. ఇంత గర్వం లాభంలేదు అంటాడు హీరో సాహిర్ హృదయంలోని భావాల్ని వ్యక్తం చేస్తూ.

ఇధర్ సే జో గయా గుజర్, ఉసీ పె హం మచల్ గయే.
జో కుఛ్ న హోసకాతొ ఫిర్,కరీబ్ సే నికల్ గయే

ఇది మజ్రూహ్ మాట. కనబడిన ప్రతి అమ్మాయిని చూసి చలించిపోతాను. ఆమె ఏమీకాకపోతే, దగ్గరకు వచ్చి వెళ్ళిపోయిందని వదిలేస్తాను. అంతే తప్ప ఆమె తనవైపు చూడలేదని, తనకేమీ కాలేదని ఏడ్చి జీవితాన్ని నాశనం చేసుకుంటే లాభం లేదు. అందువల్ల నష్టం అతడికే తప్ప ఆమెకి కాదు. కాబట్టి ఆమె చూస్తే ఆమె కృప. లేకపోతే ఏడవవద్దు. తనది కానిది, ఉంటే ఎంత, పోతే ఎంత? ఇలా అనుకుంటే ప్రేమ విఫలమైన భావాలు, క్రోధాలు, ద్వేషాలు, ఏసిడ్ దాడులు, కత్తిపోట్లు సర్వం అదృశ్యమైపోతాయి. తనది కానిదానికి ఆశపడకపోవటం శాంతమయ జీవిత సాధనకు చక్కని సోపానం.

ఇష్క్ దిలోంకా మేల్ హై ప్యారే, యే నజ్రోం కా ఖేల్ నహీ,
జబ్ తక్ దో దిల్ ఏక్ న హోలే, దిల్ కి లగీ కా రోనాక్యా ?

పదాల వాడకం అద్భుతం. మామూలు పదాలలోనే గమ్మత్తయిన వాడకంతో, గొప్ప అర్థాన్నిస్తున్నాడు సాహిర్. 'దిలోంకా మేల్ ' 'నజ్రోం కా ఖేల్ ', 'దిల్ కెలగీ ' వంటివి మామూలు పదాలు. 'దిలోంకా మేల్ ' అంటే హృదయాలు కలవటం.

నజ్ రోంకా ఖేల్ ' కళ్లతో ఆడటం. కళ్లు కలవటం, దించటం, తిప్పుకోవటం, పలకరించుకోవటం. ఇదంతా 'నజ్ రోంకా ఖేల్ ' 'దిల్ కి లగీ ' అంటే ప్రేమించటం. మరో అర్థం హృదయానికి గాయమవటం.

'దిల్ కి లగీతో క్యా కొయి జానే, మై జానూ దిల్ జానే '

అంటాడు రాజ్‌కపూర్ ఏడుస్తూ. ఇక్కడ 'దిల్ కి లగీ' అంటే ప్రేమించటం, హృదయానికి గాయమవటం. ప్రేమించినా, హృదయానికి గాయమైన ఆ వ్యక్తి, అతని హృదయానికి మాత్రమే తెలుస్తుంది. బయట ఎవరికీ తెలియదు.

ఇస్ దునియామే ఏయ్ దిల్‌వాలో దిల్ కా లగానా ఖేల్ నహీ.. ఈ ప్రపంచంలో ప్రేమించటం ఆట కాదు. ఇదో ప్రేమికుడి భావన. ఇక్కడ 'దిల్ కా లగనా ' అన్నాడు కవి. 'దిల్ కా లగానా' వేరు. 'దిల్ కీ లగీ' వేరు.

ప్రేమ అన్నది హృదయాల కలయిక. కళ్ల కలయిక కాదు. రెండు హృదయాలు ఒకటి కానంత వరకూ హృదయం కలవలేదని బాధలేదు. హృదయానికి గాయం అయిందని ఏడవటం కుదరదు. ఎంత గొప్పగా చెప్పాడు.

'వన్ సైడ్ లవ్ ' 'ఏక పక్ష ప్రేమ' ప్రేమకాదు. దానికోసం ఏడ్చి లాభం లేదు. కాబట్టి, అమ్మాయి నీ వైపు చూసి లాభంలేదు. ఆమె హృదయాన్ని గెలుపు. ఆమె హృదయాన్ని అర్థం చేసుకో. అంతవరకూ నువ్వేదో ఊహించుకుని, ఆమె నువ్వు అనుకున్నట్టు స్పందించలేదని బాధపడి లాభంలేదు నాయనా (ప్యారే) అని హాస్యం చేస్తూ చెప్తున్నాడు. పాడటంలో హాస్యం ఉంది. పదాలలో హాస్యం ఉంది. దృశ్యంలో హాస్యం ఉంది. భావంలో గొప్ప జీవిత సత్యం ఉంది. ఇదీ ఆనాటి కళాకారుల గొప్పతనం. అందుకే అల్లరి చిల్లరిగా అనిపించే పాటలు కూడా సినీ సందర్భ పరిధిని దాటి చూస్తే ఎంతో గాంభీర్యం సంతరించుకుని కనిపిస్తాయి.

ఇష్క్ కి బాజీ సీధీ బాజీ, దిల్ జీతో ఔర్ దిల్ హారో
ఇస్ సౌదేమే ఓ దిల్ వాలో, పానా క్యా ఔర్ ఖోనా క్యా?

ఇంకా సరళంగా, ఇంకో గొప్ప సత్యం చెప్తున్నాడు సాహిర్. ప్రేమ అన్నది హృదయాన్ని గెలవటం, హృదయాన్ని ఓడిపోవటంలాంటిది. ఇదొక వ్యాపారం. లావాదేవీ, హృదయాన్ని ఇయ్యి. హృదయాన్ని పుచ్చుకో. అంతే.. రెండూ సమానమే. దీనిలో పొందటం ఏముంది? కోల్పోవటం ఏముంది? అద్భుతం. ప్రేమను ఇంత గొప్పగా, సమీకరణం రూపంలో చెప్పిన వారు లేరు.A నుంచి H మైనస్ అయింది. B నుంచి H మైనస్ అయింది.B నుంచి మైనస్ అయిన H, Aకు వచ్చి చేరింది. A నుంచి మైనస్ అయిన H,B ను చేరింది. మొత్తంగా చూస్తే ఇద్దరి దగ్గరా H లున్నాయి. ఒకరి H మరొకరి దగ్గర. దీన్లో పొందిందేముంది? పోయిందేముంది? డబ్బులు ఇచ్చి వస్తువు కొన్నట్టు.

మన డబ్బులు దుకాణం వాడి దగ్గరకు పోయాయి. వాడి వస్తువు మన దగ్గరకు వచ్చింది. అంతే.

సాహిర్ లూధియాన్వీ ప్రేమను నమ్మడు. ప్రేమ మనుషుల బలహీనతని నమ్ముతాడు. ప్రేమ ఒకరికొకరు చేసుకునే మోసం అని నమ్ముతాడు.

అవ్వల్ ఆఖిర్ హర్ కొయీ అంజాన్ హై
జిందగీ బస్ రాహకే పహచాన్ హై
దోస్తోం అప్నా తో యే ఈమాన్ హై
జోభి జిత్‌నా సాథ్ దే ఎహసాన్ హై
ఉమ్ర్ క రిష్తా జోడ్ నె వాలె, అప్ని నజర్ మే దీవానే హై
పల్ దో పల్ కా సాథ్ హమారా,పల్ దో పల్ కీ యారానే హై

అద్భుతమైన నిజం. చేదు నిజాన్ని ఎంత అందంగా చెప్పాడో సాహిర్ 'బర్నింగ్ ట్రైన్' సినిమాలోని ఈ ఖవ్వాలి పాటలో. తరచి చూస్తే, ఈ ప్రపంచంలో ప్రతి వ్యక్తి అపరిచితుడే. ఎవరి జీవితం వారిదే. ఎవరి భావనలు వారివే. ఎవరెంత సన్నిహితులయినా, ఎంత తీవ్రమైన బంధం అయినా, ప్రతి వ్యక్తీ ఒంటరే. ఒకరికొకరు అపరిచితులే. ఈ జీవిత ప్రయాణంలో మనం పరిచయస్తులమే. ఎవరి గమ్యం వచ్చినప్పుడు వారు దిగిపోవాల్సిందే. అందుకే 'జిందగీ బస్ రాహకీ పహచాన్‌హై' అన్నాడు సాహిర్. కాస్సేపు కలసి ప్రయాణిస్తాం. ఎవరి గమ్యం ఎప్పుడు వస్తుందో తెలియదు. రాగానే ప్రయాణం ఆగిపోతుంది. ఎవరి ప్రయాణం ఎవరికోసం ఆగదు. ఇదే భావం 'చిత్రలేఖ' సినిమాలో 'మన్‌రే ' పాటలో 'కోయీ న సంగ్ మరే ' అని వ్యక్తపరుస్తాడు సాహిర్. ఇక్కడ జీవితం ప్రయాణంలోని పరిచయం మాత్రమే ' అన్నాడు. కాబట్టి ఎవరెంత మనకు తోడుగా ఉంటున్నారన్నది వారు మనపై చూపిస్తున్న జాలి, దయ, కరుణ తప్ప 'ప్రేమ' కాదు.

ఉత్నా హీ ఉప్కార్ సమఝ్ కొయి జిత్నా సాథ్ నిభాయే

కాబట్టి ఎవరయితే బంధం జీవితాంతం అని భావిస్తారో వారు మూర్ఖులు. మనం ఒకరికొకరు తోడుండేది క్షణకాలమే. మన స్నేహాలు, బంధాలు, అనుబంధాలు అన్నీ క్షణకాలం మాత్రమే. ఇక్కడ ఇంత వివరంగా చెప్పిన సాహిర్, 'వో దేఖేతో ' పాటలో ప్రేమ ఓ లావాదేవి మాత్రమే. హృదయం ఇవ్వటం, తీసుకోవటం లాంటిది. దీన్లో వొచ్చేది ఏముంది? పోయేదేముంది? అన్నాడు. ఇదీ సాహిర్ గొప్పతనం. పాట ఏదైనా, సందర్భం ఎలాంటిదైనా, నటీనటులు ఎవరైనా తాను రాయాలనుకున్నది, రాయాలనుకున్నట్టు రాస్తాడు. తాను చెప్పాలనుకున్నది చెప్తాడు. అది ప్రేమ గీతమైనా, విషాదగీతమైనా, విరహగీతమైనా, భక్తి గీతమైనా, భావగీతమైనా తాను నమ్మిన సిద్ధాంతం చెప్తాడు. తన వ్యక్తిత్వ ముద్ర వేస్తాడు. రాజీపడే ప్రసక్తి లేదు. అదీ సాహిర్ లూధియాన్వీ! అందుకే సాహిర్ పాటలు, నటీనటులు, సంగీత దర్శకులు, గాయనీగాయకులతో సంబంధం లేకుండా తమదైన సాహిర్ ప్రత్యేకతతో అలరారుతూంటాయి. అందుకే ఏ గేయ రచయితకూ లభించని గౌరవం సినీ గేయ రచనా ప్రపంచంలో సాహిర్‌కు లభిస్తుంది.

అందుకే సాహిర్ ఎవరినీ లెక్కచేయలేదు. పలువురు కళాకారులు సమ్మిశ్రమ సృజన అయిన సినీ గేయాన్ని నిరంకుశంగా ఏక ఛత్రాధిపతిగా ఏలాడు. ఈ పాటకు స్వరపరచిన ఎస్డీబర్మన్ 'గౌడ సారంగ ' అరుదైన రాగం ఛాయతో పాటను రూపొందించాడు. పాటలో హాస్యం పిండటానికి 'బాజీ ' అన్న పదాన్ని సాగదీసి పాడించాడు కిషోర్ కుమార్‌తో. ఆశాభోంస్లేకు శాస్త్రీయ సంగీతం తెలుసు. కాబట్టి ఆమె రాగం పరిధిలోనే అలంకారాలు వేసి హొయలు, లయలు ప్రదర్శిస్తూ పాడటంలో ఆశ్చర్యం లేదు. కానీ కిషోర్‌కుమార్ కూడా అత్యద్భుతమైన రీతిలో రాగం పరిధిలో ఒదుగుతూ, హాస్యాన్ని, రొమాన్స్‌నూ చిలికిస్తూ, దేవ్ మేనరిజమ్స్ ను తన స్వరంలో పలికిస్తూ పాడటం పాట ప్రభావాన్ని పెంచుతుంది. నాయిక 'షీలా రమణి' హఠాత్తుగా చూస్తే ఐశ్వర్యారాయ్‌లా అనిపిస్తుంది. ఈ రకంగా అన్నీ చక్కగా కుదరటంతో మామూలు సందర్భంలోని మామూలు పాట ఒక మరపురాని పరమాద్భుతమైన పాటగా, ఎంతో తాత్విక లోతుతో, ఆలోచనలు రేకెత్తిస్తూ, ఒక దిశనివ్వగల, మార్గదర్శనం చేయగల పాటలా ఎదిగింది. ఎస్డీ బర్మన్, కిషోర్ కుమార్, దేవ్ ఆనంద్‌ల జీవితాలలో గొప్ప పాటగా నిలచింది. కానీ,సాహిర్ పాటగానే గుర్తింపు పొందుతుంది. అందుకే ఇతర కళాకారులు ఎంతగా మాయాజాలం పరచినా, రచయితలు వారి మాయాజాలాన్ని మించిన మాయాజాలాన్ని పన్నే మహా మాయగాళ్లకే మాయగాళ్లు, మంత్రగాళ్లు.

(వచ్చే నెలమరిన్ని మధురమైన పాటలతో)

Post your comments